సాక్షి మంచిర్యాల

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023



హ్యాట్రిక్ ఎమ్మెల్యేలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎనిమిది ఎమ్మెల్యేలు హ్యాట్రిక్ విజయం సాధించారు. నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాత్రం ఎవరికీ హ్యాట్రిక్ విజయం దక్కలేదు. 10లో▸



గట్టి నిఘా.. తగ్గిన వేట

అరుదైన వృక్షాలు, వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. సీసీ కెమెరాల ఏర్పాటుతో అడవుల్లో వేట తగ్గుముఖం పట్టింది. 11లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0 /24.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆగ్నేయం దిశగా గాలులు వీస్తాయి. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి ప్రజావాణి రద్దు

మంచిర్యాలఅగ్రికల్చర్: శాసనసభ నియోజకవర్గ ఎన్నికల కార్యాచరణ అమలులో ఉన్నందున రేపు సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేశామని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. ఎన్నికల కోడ్ డిసెంబర్ 5 వరకు ఉన్నందున అప్పటివరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగదని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి చెన్నూర్ ఆస్పత్రిలో వైద్య సేవలు

చెన్నూర్: చెన్నూర్‌లో ఇటీవల ప్రారంభించిన ఆసుపత్రి భవనంలో ఈ నెల 16 నుంచి రోగులకు వైద్య సేవలు అందించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు. నూతన ఆసుపత్రి నిర్మాణంలో భాగంగా ఇక్కడి ఆస్పత్రిని ఎల్లక్కపేట సింగరేణి డిస్పెన్సరీలోకి మార్చి రోగులకు సేవలు అందించామని పేర్కొన్నారు. నూతన ఆస్పత్రి భవనంలోకి వైద్య పరికరాలు, ఇతర సామగ్రి తరలించడం ఆలస్యం కావడంతో సోమవారం నుంచి పూర్తి స్థాయిలో చెన్నూర్‌లోనే రోగులకు వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులు నిలిపేస్తారా?

- ప్రజలకు అన్యాయం చేయడం సరికాదు
- ఎమ్మెల్యే రేఖానాయక్ ఆరోపణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: తనపై కోపంతో ఆరు నెలల ముందు నుంచే ఖానాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిలిపి వేశారని, దళితబంధు, బీసీ బంధు పథకాలు అర్హులకు అందకుండా చూశారని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ ఆరోపించారు. జన్నారం మండల కేంద్రంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. టికెట్ ఇవ్వకపోయినా ఒకసారి తనతో మాట్లాడితే బాధ ఉండేది కాదని, 12ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్న తనకు కేవలం కేటీఆర్ మిత్రుడనే టికెట్ రాకుండా చేశారని తెలిపారు. జన్నారం మండలంలో రోడ్డు పనులకు నిధులు మంజూరైనా ఎందుకు చేయించలేదని ప్రశ్నించారు. తనపై కోపంతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందకుండా చేయడం సరికాదని అన్నారు. ఖానాపూర్ ఎన్నికల బరిలో ఉంటానని, బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఓడించమే ధ్యేయంగా పని చేస్తానని పేర్కొన్నారు. ఏ పార్టీలో చేరుతాననేది త్వరలో ప్రకటిస్తానని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ అధిష్టానం నుంచి పిలుపు వస్తోందని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి తనకు, ప్రజలకు అన్యాయం చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో జన్నారం సర్పంచ్ గంగాధర్‌గౌడ్, నాయకులు సతీశ్‌కుమార్, మౌలానా, సాధుపాషా, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా పీఈటీలు





ఈ.లింగయ్య ఎం.రుూన్సి కే.లక్ష్మి

మంచిర్యాలటౌన్: ఈ నెల 15నుంచి 17 వరకు హన్మకొండలో జరిగే సౌత్‌జోన్ జాతీయ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు పీఈటీలు న్యాయ నిర్ణేతలుగా నియామకమైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబమూర్తి, మారయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆకనపల్లికి చెందిన పీఈటీ ఈ.లింగయ్య, లక్సెట్టిపేట కేజీబీవీ పీఈటీ ఎం.రుూన్సీ, కేజీబీవీ మంచిర్యాల పీఈటీ కె.లక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు.

మార్కెట్‌ను ముంచెత్తిన పూలు



మంచిర్యాల మార్కెట్‌లో పూలు

మంచిర్యాలఅర్బన్: ఓ వైపు శరన్నవరాత్రులు.. ఇంకోవైపు బతుకమ్మ సంబరాలతో పూలకు డిమాండ్ పెరుగుతోంది. శనివారం ఎంగిలి పూల బతుకమ్మ వేడుకల కోసం తంగేడు, గునుగు, సీతమ్మజడలతోపాటు వివిధ రకాల పూలను విక్రయదారులు మార్కెట్‌కు తరలించారు. విజయవాడ, హైదరాబాద్ నుంచి బంతి, చామంతి పూలను దిగుమతి చేసుకున్నారు. పూల రకాలను బట్టి రూ.80నుంచి రూ.200 వరకు ధరలు పలికాయి. సీతమ్మజడలు చిన్న కట్టకు రూ.50 నుంచి రూ.100 వరకు ధర పలికింది.

వ్యూహం ఫలించేనా?

- కాంగ్రెస్ పార్టీ తొలి జాబితాకు ముహూర్తం ఖరారు
- 'పీఎస్సార్'పైనే అనుయాయుల ఆశలు
- గట్టి పోటీ ఇస్తున్న మరోవర్గం ఆశావహులు
- అభ్యర్థులను ప్రకటిస్తే అసంతృప్తిపై ముందే అంచనా



జంగ్ తెలంగాణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల జాబితా వెలువడనున్న నేపథ్యంలో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. రేపో మాపో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ తొలి జాబితా ప్రకటించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది స్థానాల్లో ఆశావహుల్లో ఎవరికి టికెట్ దక్కుతుందనే చర్చ సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో కీలకంగా ఉన్న పీసీసీ వ్యూహ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు అనుయాయులకు, పోటీ వర్గంగా ఉన్న నాయకుల్లో ఎవరికి టికెట్లు దక్కుతాయోనని పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ రేపుతోంది. ఉమ్మడి జిల్లాలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అనుచర వర్గాలుగా కొనసాగుతున్నాయి. పోటాపోటీగా ఉన్న ఆశావహుల్లో ఎవరికి 'చేయి' అందిస్తారనేది ఆసక్తిగా మారింది.

వడపోతలు, సమీకరణలు

ఆశావహుల బలాలు, బలహీనతలు, సామాజిక కోణాలు, సర్వేలో ఫలితాలు తదితరవన్నీ లెక్కలు వేశాకే టికెట్ల పంపకం ఓ కొలిక్కి వచ్చింది. రాష్ట్రం యూనిట్‌గా ఉమ్మడి జిల్లాలో జనరల్‌లో ఓసీ, బీసీలు, ఎస్సీల్లో మాల, మాదిగ, నేతకాని, ఎస్టీలో లంబాడా, ఆదివాసీ తదితర సామాజిక వర్గాల లెక్కలు తీసుకున్నారు. ఎవరికి వారు తమ వర్గాలను ప్రోత్సహిస్తూ ఉండడంతో ఢిల్లీ స్థాయిలో జరిగిన అభ్యర్థుల ఎంపికలో ఎవరి పేర్లు ఉండబోతాయనేది సస్పెన్స్‌గా మారింది. మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, నిర్మల్‌లో కూచాడి శ్రీహరిరావు, బెల్లంపల్లిలో వినోద్, చెన్నూరుకు నల్లాల ఓదెలు పేర్లు వినిపిస్తున్నా.. ఇంకా అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

ఎవరికి వారే ధీమా..

ఆదిలాబాద్‌లో గండ్రత్ సుజాత, బోథ్‌లో వన్నెల అశోక్, ఖానాపూర్‌లో పుర్క బాపురావు, పెందోర్ ప్రభాకర్, చారులత రాథోడ్, ఆసిఫాబాద్‌కు గణేశ్ రాథోడ్, బెల్లంపల్లిలో నాతరి స్వామి, రొడ్డ శారద, చెన్నూరులో నూకల రమేశ్ వంటి నాయకులు పీఎస్సార్‌కు అనుయాయులుగా ఉన్నారు. వీరికి పోటీగా ఆశావహుల్లో ఆదిలాబాద్ సాజిద్‌ఖాన్, బీజేపీ నుంచి చేరిన కంది శ్రీనివాస్‌రెడ్డి, బోథ్‌లో ఆడె గజేందర్, ఆసిఫాబాద్‌లో మర్సుకోల సరస్వతి, శ్యామ్‌నాయక్, చెన్నూరులో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో మాజీ మంత్రి బోడ జనార్దన్, గోమాసే శ్రీనివాస్, రాజా రమేశ్, డాక్టర్ శ్రీనివాస్, రాధిక, దుర్గం భాస్కర్, అశోక్, నరేశ్, మంచిర్యాలలో కేవీ ప్రతాప్ తదితరులు ఉన్నారు. ఇక ముథోల్‌లో డాక్టర్ కిరణ్, ఎన్‌ఆర్‌ఐ విజయ్‌కుమార్‌రెడ్డి, షిండే ఆనంద్‌రావు పటేల్, నిర్మల్‌లో కూచాడి శ్రీహరిరావు, సిర్పూర్‌లో రావి శ్రీనివాస్ ఉన్నారు. పోటాపోటీగా జిల్లా నుంచి మొదలు గాంధీ భవన్, ఢిల్లీ స్థాయిల్లో పైరవీలు చేసుకున్నారు. చివరకు ఎవరిని టికెట్ వరిస్తుందో వేచి చూడాలి.

బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలకే..?

బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వస్తే ఇక్కడి ఆశావహులకు ఇబ్బందులు కలుగవచ్చు. ఉమ్మడి జిల్లాలో మూడు ఎస్టీ స్థానాలను ఆదివాసీ, లంబాడాల నాయకులకు పంచాల్సి ఉంది. రాష్ట్రంలో ఎస్టీ స్థానాల్లో ఎంపిక ఇక్కడ ప్రభావం చూపవచ్చు. ఇప్పటివరకు ఆసిఫాబాద్ స్థానం ఆదివాసీకి ఇస్తూ, బోథ్, ఖానాపూర్‌లో లంబాడా, ఆదివాసీలకు మార్చుతున్నారు. ఈసారి ఈ కూర్పులో మార్పులు ఉండే అవకాశం ఉంది. మరోవైపు ఎమ్మెల్యే రేఖానాయక్, భర్త శ్యామ్‌నాయక్ ఇద్దరు టికెట్ ఆశిస్తున్నారు. ఒక కుటుంబంలో ఒకరికే టికెట్ నిబంధన అమలు చేస్తే వీరిలో ఎవరు సీటు త్యాగం చేస్తారనేది వేచిచూడాలి.

ఒక్కేసి పువ్వేసి చందమామ



మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. మంచిర్యాల మార్కెట్‌లో పూలు కొనుగోలు చేసిన అనంతరం ఉదయం నుంచే మహిళలు బతుకమ్మలు పేర్చే పనిలో నిమగ్నం కావడంతో ఇళ్లలో సందడిగా నెలకొంది. సిబ్బిలో తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చారు. మంచిర్యాల పట్టణంలోని పలు కూడళ్లు, వాడవాడలా బతుకమ్మలను ఒకచోటుకి చేర్చారు. చప్పట్లతో చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలతో ఆడసాగారు. ఒక్కేసి పువ్వేసి చందమామ, బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు వాడవాడలా మారుమోగాయి. అనంతరం ఆలయాలు, చెట్లకింద బతుకమ్మలను చేర్చారు. ఆటపాటల తర్వాత చెరువుల్లో నిమజ్జనం చేశారు.



విశ్వనాథ దేవస్థానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

లాభాల వాటా పంపిణీకి కోడ్ అడ్డంకి ?



శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల లాభాల వాటా ఈ నెల 16న పంపిణీపై సందిగ్ధం నెలకొంది. ఎన్నికల కోడ్ ఉన్నందున తాత్కాలికంగా నిలిపి వేసి మళ్లీ చెల్లిస్తామనేది ప్రకటిస్తామని యాజమాన్యం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇది సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో కార్మికుల్లో గందరగోళం నెలకొంది. దీనిపై కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. 2022-23లో కంపెనీ రూ.2222 కోట్లు లాభాలను ఆర్జించింది. ఇందులో నుంచి 32 శాతం వాటా కింద రూ.711 కోట్లు ఈ నెల 16న పంపిణీ చేస్తామని యాజమాన్యం ఈ నెల 4న ప్రకటించింది. దీంతో ఒక్కో కార్మికుడికి సుమారు రూ.1.6 లక్షల వరకు రానున్నాయి. పండగ వేళ డబ్బులు ఎంతో ఉపయోగపడుతాయని కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కోడ్ అమల్లోకి రావడంతో ఎన్నికల సంఘాన్ని సంప్రదించాకే డబ్బులు చెల్లించాలని యాజమాన్యం నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కార్మికులకు హక్కుగా ఉన్నందున దీనికి ఎన్నికల కోడ్‌కు ముడి పెట్టడం ఏమిటని కార్మిక సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం – సీతారామయ్య

ఎన్నికల కోడ్ కంటే ముందే ప్రకటించిన లాభాల డబ్బులను చెల్లించకుండా కంపెనీ జాప్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య తెలిపారు. కోడ్ ఆఫ్ కండక్ట్ కిందికి రాదని, కంపెనీ నిర్ణయం సరైంది కాదని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. వాటా డబ్బులు చెల్లించకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఓటు వేయండి



మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

వేమనపల్లి: ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య అన్నారు. శనివారం చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, బెల్లంపల్లి సీఐ రాజ్‌కుమార్‌తో కలిసి మండల కేంద్రంతోపాటు నీల్వాయిలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులు, యువతతో మాట్లాడారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఓటు వినియోగించుకుని ఎన్నికలు సజావుగా జరిగే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్: రామకృష్ణాపూర్, మందమర్రిలోని పలు పోలింగ్ కేంద్రాలను జైపూర్ ఏసీపీ మోహన్ శనివారం పరిశీలించారు. ఓటర్లకు కల్పించిన వసతులు, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు రాజశేఖర్, చంద్రకుమార్ పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం



చెన్నూర్‌లో వృద్ధులకు 12డీ ఫామ్స్ అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలోని వృద్ధులు, దివ్యాంగులకు భారత ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు అన్నారు. స్థానిక సరస్వతీ శిశుమందిర్ ఏరియాలో 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ కోసం 12 డీ ఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ వంద శాతం ఓటు హక్కు వినియోగించుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల తేదీ కంటే తొమ్మిది రోజుల ముందుగా ఫామ్‌ను నింపి బూత్‌లెవల్ అధికారులకు అందజేయాలని సూచించారు. ఎన్నికల రోజు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 3,097 మంది 80 ఏళ్లు పైబడిన వృద్ధులతోపాటు దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. భారత ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని, ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ, బూత్ లెవల్ అధికారులు రజియా, విజయ పాల్గొన్నారు.

కేసీఆర్ వెంటే తెలంగాణ ప్రజలు

- ఈ ఎన్నికల్లో ఓట్ల తుపాన్ రాబోతుంది..
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్



ఆర్‌కేపీలో మాట్లాడుతున్న సుమన్

రామకృష్ణాపూర్: కేసీఆర్‌కు, తెలంగాణ ప్రజలకు ఒక ఎమోషనల్ కనెక్షన్ ఉంటుందని, తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ వెంటే ఉంటారని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఓట్ల తుపాన్ వచ్చి 90కి పైగా సీట్లను గెలుచుకోబోతున్నామని ధీమా వ్యక్తంచేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో తన హయాంలో జరిగిన అభివృద్ధిని 'ప్రగతి ప్రస్థానం' అనే ఓ బుక్‌లెట్ ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఎన్నికల దృష్ట్యా పార్టీ నాయకులు వ్యక్తిగత దూషణలకు వెళ్లకుండా చేసిన అభివృద్ధి పనులతోపాటు చేయనున్న అభివృద్ధి గురించే మాట్లాడాలని సూచించారు. పార్టీ పట్టణ ఇన్‌చార్జ్ గాండ్ల సమ్మయ్య, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని వివరించాలి..

జైపూర్: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని, మరోమారు బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారం వచ్చేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని బాల్క సుమన్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బల్మూరి అరవీందర్‌రావు, జిల్లా నాయకులు రిక్కుల మధుకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మేడి సునిత, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేస్తాం

- ఐదు స్థానాలు కోరాం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పాతమంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీ చేస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పొత్తుపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో మంతనాలు సాగుతున్నాయని, రెండు మూడు రోజుల్లో విషయం తేలనుందని చెప్పారు. బెల్లంపల్లి, హుస్నాబాద్, మునుగోడు, కొత్తగూడెం, వైరా అసెంబ్లీ స్థానాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఎన్నికల్లో వామపక్షాల మద్దతు తీసుకుని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించి మోసం చేసిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, సంక్షేమ పథకాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని అన్నారు. పోటీ పరీక్షలు వాయిదా వేస్తూ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందని అన్నారు. దేశంలో బీజేపీని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, మతోన్మాద దోపిడీ పాలన నుంచి ప్రజలను రక్షించడానికి లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం ఏర్పాటయ్యే కూటమిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రలోభాలతో బీఆర్‌ఎస్ నాయకులు'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

నస్పూర్: మంచిర్యాల నియోజకవర్గంలో చేసిన సేవ కార్యక్రమాలతో తాము ఎన్నికల బరిలోకి వెళ్తున్నామని, బీఆర్‌ఎస్ నాయకులు మద్యం, డబ్బు తదితర ప్రలోభాలతో వస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ, టీపీసీసీ ఎలక్షన్ స్ట్రాటజీ కమిటీ చైర్మన్ ప్రేంసాగర్‌రావు తెలిపారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నస్పూర్ పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రేంసాగర్‌రావుతోపాటు డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ హాజరయ్యారు. ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతి శ్రీనివాస్, కౌన్సిలర్లు సురిమిల్ల వేణు, తెనుగు లావణ్య, బొద్దున సంధ్యారాణి, నాయకులు గెల్లు మల్లేశ్, దేవేందర్, గుమ్మడి తిరుపతి పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సీఓఈలో రెండో రోజు శనివారం 9వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. ములుగు, పెద్దపల్లి, మంచిర్యాల, కుమురంభీమ్ జిల్లాల గురుకుల విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ పోటీల్లో నువ్వా నేనా అనే రీతిలో తలపడ్డారు. క్యారమ్స్ అండర్-14 విభాగంలో ఆసిఫాబాద్, ఏటూరు నాగారం గురుకుల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. చదరంగం పోటీల్లో మంథని, కోటపల్లి విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నారు. షాట్‌పుట్ పోటీల్లో కె.సంకేత్ (కాసిపేట) బంగారు పతకం, జె.వరుణ్ సందేశ్(జైపూర్) వెండి, జే.సాయికుమార్(ఆసిఫాబాద్) కాంస్య పతకాలు గెలుచుకున్నారు. డిస్కస్‌త్రోలో కే.సంకేత్(కాసిపేట) బంగారు పతకం, కే.మల్లికార్జున్(ఏటూరు నాగారం) వెండి, జే.ఠాగూర్(ఏటూరు నాగారం) కాంస్య పతకాలు సాధించారు. 200 మీటర్ల పరుగు పందెం పోటీల్లో జె.వరుణ్‌సందేశ్(జైపూర్) బంగారు, జే.సాయికుమార్(ఆసిఫాబాద్) వెండి, ఏ.సాగర్(సిర్పూర్-టి) కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

- అండర్-17 షాట్‌పుట్ పోటీల్లో ఆర్.విక్కీ(ఆసిఫాబాద్) బంగారు పతకం, కె.శ్రీనాథ్(సిర్పూర్-టీ) వెండి, బి.రాహుల్(కోటపల్లి) కాంస్య పతకం గెలుపొందారు.
- అండర్-19 షాట్‌పుట్ పోటీల్లో డి.శ్యాంసుందర్ (కోటపల్లి) బంగారు పతకం, ఎల్.అభిలాష్(ఏటూరు నాగారం) వెండి, ఆర్.శివ(బెల్లంపల్లి సీఈవో) కాంస్య పతకం సాధించారు. విజేతలకు ఆదిలాబాద్ రీజియన్ సంక్షేమ గురుకులాల ఆర్సీఓ కె.స్వరూపారాణి పతకాలు అందజేశారు. సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, గురుకులాల ప్రిన్సిపాల్‌లు లలితకుమారి, జ్యోతి, సంధ్యారాణి, స్వరూప, శ్రీనివాస్, వినోద్ సాదా, సంతోష్‌కుమార్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు పూదరి నగేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జోనల్ స్థాయి క్రీడలు



పరుగుపందెం పోటీల్లో క్రీడాకారులు




పరుగుపందెంలో పాల్గొన్న విద్యార్థులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 9వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం పరుగుపందెం, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రాజమణి తెలిపారు. లాంగ్‌జంప్ అండర్-14 విభాగంలో టి.లక్ష్మి(సిర్పూర్) బంగారుపతకం, ఎం.వేదాంశిక (ములుగు) వెండి, ఏ.కీర్తన(లక్సెట్టిపేట) కాంస్య పతకాలు సాధించారు. అండర్-17 విభాగంలో లాంగ్‌జంప్ బి.కృష్ణవేణి(చిట్యాల) బంగారుపతకం, సంస్కృతి(చెన్నూర్) వెండి, ఎం.దీపిక(లక్సెట్టిపేట) కాంస్య, 1500 మీటర్ల పరుగు పందెంలో ఏ.రాణి(చిట్యాల) బంగారు, ఆశ్రిత(లక్సెట్టిపేట) వెండి, రక్షిత(సిర్పూర్‌టి) కాంస్య, అండర్-19 విభాగం 1500 మీటర్ల పరుగుపందెంలో రష్మిత(లక్సెట్టిపేట), బంగారు, సుస్మిత(మల్లాపూర్) వెండి, మయూరి(మందమర్రి) కాంస్య పతక విజేతలుగా నిలిచారు.

హ్యాట్రిక్ ఎమ్మెల్యేలు

- ఉమ్మడి జిల్లాలో 8 మంది
- ప్రజల మద్దతుతో వరుసగా మూడుసార్లు గెలుపు
- నాలుగు నియోజకవర్గాల్లో ఎవరికీ దక్కని చాన్స్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1952 నుంచి ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేలు అత్యధిక మెజార్టీ సాధించి హ్యాట్రిక్ సొంతం చేసుకున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు నుంచి ముగ్గురు, ఆసిఫాబాద్ నుంచి ఒక్కరు, నిర్మల్ నుంచి ఇద్దరు, ముథోల్ నుంచి ఒక్కరు, ఆదిలాబాద్ నుంచి ఒకరు మొత్తంగా 8 మంది ఎమ్మెల్యేలు వారికి ఉన్న ప్రజాబలంతో హ్యాట్రిక్ సాధించారు. మిగతా వారు కొద్దిలో హ్యాట్రిక్ మిస్ చేసుకున్నా ప్రస్తుతం జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది హ్యాట్రిక్ సాధించేందుకు వేచిచూస్తున్న వారూ ఉన్నారు. హ్యాట్రిక్ విజయాలు గత ఎన్నికల్లో సాధ్యమైనా ప్రస్తుతం కొన్ని నియోజకవర్గాలకు అందని ద్రాక్షగా మారాయి. మంచిర్యాల, సిర్పూర్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల్లో ఒక్కరికి కూడా హ్యాట్రిక్ పొందే అవకాశం రాలేదు. – మంచిర్యాలటౌన్



నిర్మల్ నుంచి 'పొద్దుటూరి, 'సముద్రాల'..


పొద్దుటూరి నర్సారెడ్డి


వేణుగోపాలచారి

నిర్మల్ నియోజకవర్గం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు హ్యాట్రిక్ సాధించారు. 1962, 1967లలో నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన పొద్దుటూరి నర్సారెడ్డి విజయం సాధించారు. మూడోసారి 1972లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి హ్యాట్రిక్ విజేతగా నిలిచారు. రెవెన్యూశాఖ మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1985, 1989, 1994లలో నిర్వహించిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసిన సముద్రాల వేణుగోపాలచారి వరుసగా విజయం సాధించారు. 1996, 1998, 1999లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ విజయం సాధించి డబుల్ హ్యాట్రిక్ నేతగా పేరుగాంచారు. రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రిగా, కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రిగా కూడా పనిచేశారు.

ఆదిలాబాద్‌లో 'జోగు'


జోగు రామన్న

ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే జోగు రామన్న మాత్రమే హ్యాట్రిక్ సాధించారు. 2009లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన జోగు రామన్న విజయం సాధించారు. ఆ తర్వాత 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో, 2014, 2018లో నిర్వహించిన సాధారణ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడంతో పాటు నాలుగుసార్లు వరుసగా గెలిచిన మొదటి ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించారు. రాష్ట్ర అటవీశాఖ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. 1978, 1985, 1989, 2004లో నిర్వహించిన ఎన్నికల్లో చిలుకూరి రాంచంద్రారెడ్డి నాలుగుసార్లు గెలిచినా హ్యాట్రిక్ పొందలేక పోయారు.

ముథోల్ నుంచి గడ్డెన్న


జి. గడ్డెన్న


నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గం నుంచి ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీచేసిన గడ్డెన్న హ్యాట్రిక్ సాధించారు. 1967లో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన గడ్డెన్న ఆ తర్వాత 1972, 1978, 1983లలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి వరుసగా నాలుగుసార్లు విజయం సాధించి హ్యాట్రిక్ సొంతం చేసుకున్నారు. నిత్యం ప్రజాసేవలో ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉన్న గడ్డెన్న 1989, 1999లలో నిర్వహించిన ఎన్నికల్లోసైతం గెలిచి సత్తా చాటారు.

ఆసిఫాబాద్ నుంచి భీమ్‌రావు


కొట్నాక భీమ్‌రావు

1952లో ఆసిఫాబాద్ నియోజకవర్గం ఏర్పడింది. 1962, 1967, 1972లో నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కొట్నాక భీమ్‌రావు వరుసగా మూడుసార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో 1978లో తొలిసారి ఈ నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన దాసరి నర్సయ్య విజయం సాధించారు. 1983, 1985, 1994లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ నుంచి పోటీ చేసిన గుండా మల్లేశ్ గెలుపొందారు. 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన దాసరి నర్సయ్య రెండోసారి విజయం సాధించారు. కానీ మూడుసార్లు వరుసగా గెలువక పోవడంతో గుండా మల్లేశ్ హ్యాట్రిక్ కోల్పోయారు.

చెన్నూరు నుంచి ముగ్గురు..


కోదాటి రాజమల్లు


బోడ జనార్దన్


నల్లాల ఓదెలు

చెన్నూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడు, నాలుగు సార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించిన వారు ముగ్గురున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కోదాటి రాజమల్లు 1962 నుంచి 1978 వరకు మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. 1985లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన బోడ జనార్దన్ ఘన విజయం సాధించారు. వరుసగా నాలుగుసార్లు గెలుపొంది రికార్డు సృష్టించారు. 2009లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన నల్లాల ఓదెలు అత్యధిక మెజార్టీ సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఆ తర్వాత 2010లో జరిగిన ఉప ఎన్నికతో పాటు, 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ విజయం సాధించారు. ప్రభుత్వ విప్‌గా పనిచేసిన ఆయనకు 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం టీఆర్ఎస్ తరఫున టిక్కెట్ కేటాయించకపోవడంతో నాలుగోసారి పోటీచేసే అవకాశాన్ని చేజార్చుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అదే కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న బోడ జనార్దన్ సైతం టికెట్ ఆశించే వారిలో ఉన్నారు.

క్లుప్తంగా

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య


మల్లేశ్ (ఫైల్)

దహెగాం (సిర్పూర్): భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై సనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఐనం గ్రామానికి చెందిన కంబాల మల్లేశ్ (36)కు నెన్నెల మండలంలోని కోనంపేటకు చెందిన మమతతో పన్నెండేళ్ల క్రితం వివాహమైంది. కాపురం సాఫీగానే సాగుతున్న క్రమంలో ఇటీవల రాఖీ పౌర్ణమికి దంపతులిద్దరూ కోనంపేటకు వెళ్లగా మల్లేశ్ ఒక్కడే ఇంటికి తిరిగివచ్చాడు. ఆ తర్వాత వెళ్లి పిలిచినా ఆమె రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని తండ్రి కంబాల బానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్య


శ్రీను మృతదేహం

తిర్యాణి(ఆసిఫాబాద్): తల్లిదండ్రులు మందలించారని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మంగి గ్రామ పంచాయతీ పరిధిలోని టొక్కిగూడకు చెందిన కోవ అనంతరావు కుమారుడు కోవ శ్రీను (22) ఇంటర్ పూర్తిచేశాడు. ఇంట్లో ఖాళీగానే ఉంటూ తమ అవసరాలకోసం తల్లిదండ్రులను డబ్బులు అడుక్కుని జులాయిగా తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఏదైనా పనిచేసుకుని తమకు ఆసరాగా నిలవాలని మందలించారు. మనస్తాపానికి గురై ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో తన సోదరికి ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గ్రామ శివారులోని దట్టమైన అటవీప్రాంతంలో మృతదేహాన్ని గుర్తించారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో కార్మికుడు మృతి


మల్లాచారి(ఫైల్)

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ ఓసీపీలో ఈపీ ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆరుద్రా మల్లాచారి (56) గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం మొదటి షిఫ్ట్ విధులకు హాజరైన కార్మికుడు విధుల్లో భాగంగా షవల్‌కు మెయింటనెన్సు నిర్వహించిన తర్వాత భోజనం చేశాడు. కొద్దిసేపటికి ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో తోటి కార్మికులు ఆర్కే 8 డిస్పెన్సరీకి తరలించగా కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

'కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా ప్రకటించాలి'

బెల్లంపల్లి: లాభాల్లో వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం బెల్లంపల్లి సింగరేణి సివిక్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులు నిరసన తెలిపారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో రెండో రోజు నిరసన సాగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కంపెనీకి లాభాలు రావడానికి కాంట్రాక్టు కార్మికుల శ్రమ కూడా ఉందన్నారు. పర్మనెంట్ కార్మికులకు చెల్లిస్తున్న మాదిరిగానే తమకు సైతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటి, కృష్ణవేణి, గణేశ్, లత, కొమురయ్య, బాను, లింగయ్య, కరుణ, సునీత, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలని కోరుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గజ్జి మల్లేశ్, ముత్యాల వెంకటేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు, క్లీనర్ల సమ్మె తాత్కాలిక వాయిదా

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి ఏరియాలో పనిచేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్ట్ లారీల డ్రైవర్లు, క్లీనర్లు చేపట్టిన సమ్మె తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ తెలిపారు. శనివారం ట్రాన్స్‌పోర్ట్ యాజమాన్యంతో జరిగిన చర్చల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో అనేక ఏళ్లుగా తక్కువ వేతనాలతో పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, కనీస వేతనం నెలకు రూ. 32 వేలు ఇవ్వాలని, సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, క్యాంటీన్ సౌకర్యం కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29న మరో దఫా చర్చలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి, ప్రధాన కార్యదర్శి గౌస్, తిరుపతి, లచ్చన్న, రవి, గోపాల్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోగె ఉపేందర్

సర్‌సిల్క్ కాలనీలో చోరీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన విశ్రాంత ఉద్యోగురాలు పద్మ ఈ నెల 12న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలో దాచి ఉంచిన రెండు తులాల బంగారు, ఎనిమిది తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.10 వేల నగదు అపహరించారు. శనివారం ఇంటికి చేరుకున్న బాధితులు తలుపుల తాళాలు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌హెచ్‌వో బి.స్వామి ఘటన స్థలానికి చేరుకుని వేలిముద్ర నిపుణులు, డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి

మందమర్రిరూరల్(చెన్నూర్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు పాఠశాల స్థాయి నుంచే కాపాడాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి అన్నారు. ఈ నెల 10 నుంచి 19 వరకు ఢిల్లీలో సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం సీసీఆర్‌టీ సభావేదికపై లింగాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగవర్మతో కలిసి సంప్రదాయ దుస్తులు ధరించి ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ గొప్పతనాన్ని వివరించారు.


సంప్రదాయ దుస్తుల్లో ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి

మద్యం పట్టివేత

మంచిర్యాలక్రైం: అనుమతి లేకుండా తరలిస్తున్న మద్యం పట్టుకున్నట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. రాజీవ్‌నగర్‌కు చెందిన సబ్బని బొర్రయ్య బెల్ట్‌షాప్ నిర్వహణ నిమిత్తం ద్విచక్ర వాహనంపై మద్యం తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు నిందితుడి వద్ద నుంచి బైక్, రూ.3500 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి శారదీయ నవరాత్రులు


విద్యుత్ కాంతుల మధ్య బాసర ఆలయం


సరస్వతీ అమ్మవారు

- ముస్తాబైన బాసర ఆలయం
- ఆలయం చుట్టూ విద్యుత్ కాంతులు
- ఒక్కోరోజు ఒక్కో రూపంలో దర్శనమివ్వనున్న అమ్మవారు

భైంసా(ముథోల్): బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఆదివారం నుంచి శారదీయ నవరాత్రి ఉత్సవాలు ఆరంభం కానున్నాయి. ఈనెల 23 వరకు తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు కొనసాగుతాయి. దసరా ఉత్సవాల్లో లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయం, గోపురాలు, ప్రధానగుడి, అంతరాలయం, మహంకాళి ఆలయం, క్యూలైన్ ప్రాంగణం గార్డెన్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయం కొత్తశోభను సంతరించుకుంది. టీటీడీ సత్రం నుంచి రోడ్డుమార్గంలో ఆలయానికి వెళ్లేలా స్వాగత తోరణాలు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు అమర్చారు. బాసర గోదావరి నది స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతున్నారు. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రసాదాల కౌంటర్, అక్షరాభ్యాస మండపాల వద్ద రద్దీ దృష్ట్యా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

నిత్యాన్నదానం...

బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో ఉచిత అన్నదానం జరుగుతుంది. నాందేడ్‌కు చెందిన బాబాజీ జగదీశ్‌మహారాజ్ గాడిపుర, బాసర ఆలయం ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్నారు.

రోజుకో రూపంలో...

సరస్వతీ అమ్మవారు తొమ్మిది రోజులపాటు రోజుకో రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మొదటి రోజు శైలపుత్రి అలంకారం, రెండో రోజు బ్రహ్మచారిణి, మూడో రోజు చంద్రఘంట, నాలుగోరోజు కూష్మాండ, ఐదో రోజు స్కందమాత, ఆరోరోజు కాత్యాయని, ఏడో రోజు కాళరాత్రి, ఎనిమిదో రోజు మహాగౌరి, తొమ్మిదో రోజు సిద్ధిధాత్రి అలంకారంలో దర్శనం ఇస్తారు. అమ్మవారికి ప్రతీరోజు వేర్వేరు నైవేద్యాలు సమర్పిస్తారు. విశేష అర్చనలు, పూజలతో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఆధ్వర్యంలో ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి, బాసర ఎస్సై గణేశ్ భద్రత చర్యలు తీసుకుంటున్నారు.

దీక్షలకు ఏర్పాట్లు...

నవరాత్రి ఉత్సవాల్లో వందలాది భక్తులు అమ్మవారి దీక్షలు స్వీకరిస్తుంటారు. తెల్లని వస్త్రాలు ధరించి తొమ్మిది రోజులపాటు పాదరక్షలు లేకుండా కఠికనేలపై నిద్రిస్తూ ఉపవాస దీక్షలు చేస్తారు. అమ్మవారికి పూజలు చేసి ఆలయంలోనే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఏర్పాట్లు పూర్తి..

సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఏటా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాం. ఈసారి ఆదివారం నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దాం. వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– విజయరామారావు, ఆలయ ఈవో

రూ.2.23 లక్షల నగదు పట్టివేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2.23 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంచిర్యాలకు చెందిన వేల్పుల నరేష్ రూ.68,290 నగదు తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. సరైన ఆధారాలు చూపించకపోవడంతో అట్టి నగదును పోలీసులు జప్తు చేశారు. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధి కాల్‌టెక్స్ ఏరియాలో బెల్లంపల్లి మండలం కాసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సానా కిరణ్ వద్ద రూ.1.55 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తి తనవద్ద ఉన్న డబ్బులకు తగిన ఆధారాలు చూపించక పోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదును సీజ్ చేసినట్లు ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ) బెల్లంపల్లి అధికారి ఎల్తూరి సురేఖ తెలిపారు.

రూ.లక్ష నగదు స్వాధీనం

లక్సెట్టిపేట(మంచిర్యాల): ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల స్టేజీ వద్ద ఎఫ్ఎస్‌టీ సిబ్బంది శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా నాగేశ్వర్ అనే వ్యక్తి కారులో రూ.లక్ష నగదుతో మంచిర్యాల వైపు వెళ్తూ పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లోఎఫ్ఎస్‌టీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి

- మంచిర్యాలలో జర్నలిస్టుల నిరసన

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ విప్, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ జర్నలిస్టులను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ, వెంటనే జర్నలిస్టులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల ఐబీ చౌరస్తా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం మాట్లాడుతూ బాల్క సుమన్ బేషరతుగా జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆయన ఎన్నికల ప్రచార వార్తలను జిల్లావ్యాప్తంగా నిషేధిస్తామని హెచ్చరించారు. ఈ అంశాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పింగిలి సంపత్‌రెడ్డి, కోశాధికారి వంశీకృష్ణ, ఉపాధ్యక్షులు సురేశ్‌చౌదరి, కొండ శ్రీనివాస్, పడాల సంతోష్, సభ్యులు రాజేశ్వర్, రాజు, రమేశ్ రెడ్డి, రాజలింగు, సతీష్, భాస్కర్, ఎర్రం ప్రభాకర్, నేరెళ్ల రమేశ్, రాజనర్సు పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రిరూరల్: ప్రభుత్వ విప్ బాల్క సుమన్ వ్యాఖ్యలపై శనివారం మందమర్రి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మందమర్రి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మద్దెల సంజీవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్, జర్నలిస్ట్‌లు పార్వతి రాజేష్, సతీష్, శ్రీనివాస్, రాకేష్, సత్యం, టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సంజయ్‌కుమార్, రమేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు